
నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, గురువారం 15 మే 2025 | BHADRADRI KOTHAGUDEM

*కొత్త రేషన్‌కార్డుల ముచ్చట ఇప్పట్లో ముగిసేటట్లు కనిపించడం లేదు. కొండంత రాగం తీసి.. అదేదో పాట పాడినట్లుగా ఉంది కాంగ్రెస్ ప్రభుత్వ వ్యవహారం. అధికారం లోకి రాగానే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రగల్భాలు పలికి.. ఇప్పుడేమో చతికిలపడింది. దరఖాస్తు చేసుకున్న వేలాదిమంది నిరుపేదలు కొత్తకార్డుల కోసం వేయికండ్లతో ఎదురుచూస్తున్నారు. ఇన్నాళ్లు విసిగించిన ప్రభుత్వం తీరా కొద్దిమందికే కొత్త కార్డులు జారీ చేస్తున్నారు. వాటిలోనూ గజిబిజి.. గందరగోళం నెలకొంది. సపరేటుగా కొత్తకార్డులు ఇవ్వకుండా పాతకార్డుల్లోనే కొత్త పేర్లు యాడింగ్ చేస్తున్నారు. ఇదేమిటని అధికారులను అడిగితే పొంతనలేని సమాధానాలు చెబుతున్నారు. దీంతో అసలు దరఖాస్తు చేసుకున్నవారందరికీ కొత్త రేషన్ కార్డులు వస్తాయో.. లేదోనన్న అనుమానం కలుగుతున్నది. రేషన్‌కార్డు లేకపోవడంతో సన్నబియ్యానికి నోచుకోకపోవడంతోపాటు ప్రభుత్వ పథకాలకూ అర్హత కోల్పోతుండడంతో నిరుపేదలు లబోదిబోమంటున్నారు. – ఖమ్మం, మే 14*

# గజిబిజి.. గందరగోళం

- పాతకార్డుల్లోనే కొత్త పేర్లు యాడింగ్
- ఒకే ఇంటినెంబర్ ఉంటే అంతేనంటున్న అధికారులు
- జారీ అయిన అరకొర కార్డులన్నీ అస్తవ్యస్తం
- దరఖాస్తులకు కొత్త కార్డులు వచ్చేనా?
- సన్నబియ్యం అందక నిరుపేదల ఇబ్బందులు
- ప్రభుత్వ పథకాలకూ అర్హత కోల్పోతున్న దీనస్థితి

## కొత్త రేషన్‌కార్డుల్లో వింత పరిస్థితి



ఖమ్మం రూరల్ మండలం ఎంవీ పాలెంలో గడ్డం బతుకమ్మ రేషన్ కార్డులోకి వచ్చి చేరిన మనవడి కుటుంబ సభ్యుల పేర్లు



మంచానికే పరిమితమైన గడ్డం బతుకమ్మ

''ఖమ్మం రూరల్ మండలం ఎం.వెంకటాయపాలెం గ్రామానికి చెందిన గడ్డం బతుకమ్మకు దాదాపు 70 ఏండ్లు. కూతురు, కుమారులకు ఎప్పుడో వివాహాలయ్యాయి. ఆమెకు అంత్యోదయ రేషన్‌కార్డు ఉంది. రెండేళ్ల క్రితం పక్షవాతం రావడంతో మంచానికే పరిమితమైంది బతుకమ్మ. ప్రతి నెలా ఓటీపీ విధానం ద్వారా ఆమె కార్డుపైన 35 కిలోల బియ్యాన్ని కుటుంబ సభ్యులు తీసుకెళ్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కొత్తకార్డులకు అవకాశం కల్పించడంతో ఆమె మనువడు తన భార్య, ఇద్దరు పిల్లలతో దరఖాస్తు చేసుకున్నాడు. ఐతే వారం క్రితం బియ్యం తీసుకునేందుకు రేషన్‌షాపులో ప్రయత్నించగా బతుకమ్మ కార్డుపై ఓటీపీ రావడం లేదు. ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆమె కార్డులోకి తన మనువడు అతని కుటుంబసభ్యులు వచ్చి చేరడంతో ఐదుగురు సభ్యులు కనిపిస్తున్నారు. ఇద్దరి కంటే ఎక్కువ మంది ఉంటే ఓటీపీ ద్వారా బియ్యం తీసుకోవడం కుదరదు. ఇదేమిటని ఆమె అల్లుడు అధికారులను కలువగా ప్రభుత్వం పెట్టిన యాప్ ద్వారా ఒకే ఇంటి నెంబర్ ఉన్న వారందరూ ఒకే కార్డులోకి వస్తారని సమాధానం చెప్పడం గమనార్హం.

### అమ్మమ్మ, నాయనమ్మ కార్డుల్లోకి మనువళ్లు, మనువరాళ్లు

రాష్ట్రవ్యాప్తంగా కొత్త కార్డుల జారీలో వింత పరిస్థితి నెలకొంది. ఖమ్మం జిల్లాలో కొత్తకార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వేలాది మంది ఆశగా ఎదురుచూస్తున్నారు. వివాహాలు జరిగి సంవత్సరాలు అవుతున్నా కొత్త రేషన్ కార్డులు లేక ఎంతోమంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త కార్డుకు దరఖాస్తు చేసుకోవాలంటే అప్పటికే ఉన్న కార్డులో నుంచి పేరు తొలగించుకోవాలనే నిబంధన ఉంది. ఆధార్ కార్డు ఒక్కటే ఉంటుంది కనుక ప్రస్తుతం ఉన్న కార్డులో పేరు ఉంటే కొత్త కార్డుకు మీ సేవలో దరఖాస్తు చేసుకునే వీలు ఉండని కారణంగా వేల సంఖ్యలో ప్రజలు తమ పేర్లను తొలగించుకున్నారు. భార్య, భర్త ఇద్దరు కూడా వారి వారి తల్లిదండ్రుల కార్డుల్లో ఉన్న పేర్లను తొలగించుకుని పిల్లలతో సహా కొత్త కార్డులకు దరఖాస్తు చేయగా అమ్మమ్మ, నాయనమ్మ కార్డులలోకి మనువళ్లు, మనువరాళ్ల పేర్లు ఎక్కాయి. పాత కార్డుల్లోనే వారి పేర్లు జమ అయ్యాయి.. తప్ప కొత్తగా వారి కుటుంబానికి సపరేటుగా రేషన్ కార్డు రాలేదు. అల్లుడు పేరు అత్తగారి ఊర్లో, కూతురు పేరు తల్లిగారి ఊర్లో రావడంతో కొత్తకార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో గందరగోళ పరిస్థితి నెలకొంది.

#### కొత్త కార్డులు వచ్చాయా? రాలేదా?

జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం మీ సేవా, ప్రజాపాలన ద్వారా 72,131 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో దాదాపు 20 వేల మందికి పైగా రెండు చోట్ల దరఖాస్తు చేసుకున్నారు. చాలా మంది పేర్లు గతంలో వారు ఏ కార్డులో ఐతే ఉన్నారో తిరిగి వారి పేర్లు పిల్లల పేర్లుతో సహా పాత కార్డులోనే జమ అయ్యాయి. ఐతే అలా రానివారూ కూడా జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నట్లు సమాచారం. ఐతే వారికి కొత్త కార్డు వచ్చిందా? రాలేదా? అనే విషయం తెలియక రేషన్ డీలర్ల వద్దకు తిరుగుతున్నారు. రేషన్‌షాపులో కార్డు నెంబర్ ఉంటేనే ఓపెన్ అయ్యే అవకాశం ఉంటుంది కనుక మీ సేవా కేంద్రాలకు వెళ్లి తెలుసుకుంటున్నారు. చాలామందికి కొత్త కార్డులు రాకపోవడంతో బాధపడుతూ వచ్చేనెలలో అయినా వస్తుందోనని ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

### జిల్లాలో 72,131 దరఖాస్తులు..

ఖమ్మం జిల్లాలో మీ సేవా కేంద్రాలు, ప్రజాపాలన గ్రామసభల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 72,131. వీరుకాకుండా ఇప్పటికే కార్డు ఉండి పిల్లల పేర్లు ఎక్కకుండా ఉన్నవారు కూడా వేల సంఖ్యలోనే ఉన్నారు. వీరి సంఖ్య కచ్చితంగా ఎంత అనేది అధికారుల వద్ద సమాచారం లేదు. కొత్త కార్డుల దరఖాస్తుల సంఖ్య ఉంది కానీ పిల్లల పేర్లు ఎన్ని అనేవి మాత్రం లేదు. అవన్నీ ఆన్‌లైన్‌లో చేసుకోవడంతో జిల్లా అధికారుల వద్ద నిర్దిష్టమైన సమాచారం లేదు. మీ సేవా కేంద్రాల ద్వారా ఖమ్మం అర్బన్ 1,505, నేలకొండపల్లి 478, చింతకాని 467, ఖమ్మం రూరల్ 418, కొణిజర్ల 378, ముదిగొండ 376, కల్లూరు 365, బోనకల్ 325, తల్లాడ 275, సింగరేణి 272, మధిర 263, రఘునాథపాలెం 245, వైరా 233, కామేపల్లి 210, సత్తుపల్లి 185, కూసుమంచి 174, వేంసూరు 154, పెనుబల్లి 150, తిరుమలాయపాలెం 110, ఏన్కూరు 76, ఎర్రుపాలెం 56 దరఖాస్తులు మొత్తం జిల్లాలో 6,717 దరఖాస్తులు మీ సేవా కేంద్రాల ద్వారా కొత్త కార్డులకు దరఖాస్తులు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే చేపట్టిన ఆరు పథకాలకు సంబంధించి స్వీకరించిన వాటిలో రేషన్‌కార్డుల కోసం ప్రజాపాలన గ్రామసభల్లో 66,115 దరఖాస్తులు వచ్చాయి.

### పథకాల వర్తింపునకు అడ్డంకే..

ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు రేషన్ కార్డును ప్రామాణికంగా తీసుకుంటే పేద ప్రజలకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంటుంది. కార్డులోని ఏ ఒక్కరైనా గతంలో పథకం పొంది ఉంటే ఆ కార్డులోని మిగిలిన సభ్యులకు వర్తించే అవకాశం ఉండదు. ఉదాహరణకు గతంలో అత్త పేరుపైన ప్రభుత్వం నుంచి ఇల్లు వచ్చి ఉంటే ఇప్పుడు కోడలుకు ఇందిరమ్మ ఇల్లు వచ్చే అవకాశం లేదు. ఇలా రేషన్ కార్డు ప్రామాణికంగా తీసుకునే ఏ పథకం అయినా ఇబ్బందులు తప్పవని పేదలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రభుత్వం స్పందించి వేరువేరుగా రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుకుంటున్నారు.

## నాణ్యమైన విద్య కోసమే వృత్యంతర శిక్షణ

### భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం గణేష్ టెంపుల్, మే 14 : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసమే ప్రభుత్వం ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నదని, వీటిని ప్రతీ ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని భద్రాద్రి కలెక్టర్ జితేశ్ వి పాటిల్ అన్నారు. జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు తాము ఎంచుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నా, ప్రభుత్వ పాఠశాలలను నిలబెట్టేందుకు కృషి చేయాలన్నా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే మార్గమన్నారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని తరగతి గదిలో వినియోగించడం, మౌలిక భాషా, గణిత అభివృద్ధి కార్యక్రమాన్ని కృత్రిమ మేధా ఆధారంగా అభివృద్ధి పరచడం కోసం ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా రూపొందించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదును పెంచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వరాచారి, జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్, జిల్లా ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీశ్‌కుమార్, రిసోర్స్ పర్సన్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్లను దొరకబట్టారు..

### బాధితులకు తిరిగి అప్పగించిన పోలీసులు



పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను తిరిగి పొందిన బాధితులతో పోలీస్ అధికారులు

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 14 : వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న ఫోన్లను కొత్తగూడెం జిల్లా పోలీసులు దొరకబట్టారు. బాధితులకు ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు బుధవారం కొత్తగూడెంలోని తన కార్యాలయంలో వాటిని అప్పగించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలో 150 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సెంట్రల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) ద్వారా రికవరీ చేసి అప్పగించినట్లు ఎస్పీ తెలిపారు. బాధితులు సీఈఐఆర్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా అడిగిన వివరాలను కచ్చితంగా నమోదు చేసుకుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్ నుంచి తిరిగి వారి మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి కనిపెట్టడం జరుగుతుందన్నారు. గడిచిన 5నెలల్లో మొత్తం 743 ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు వెల్లడించారు. ఫోన్‌ను అవతలి వ్యక్తి వినియోగించినప్పుడు మాత్రమే రికవరీ చేయడం సాధ్యమన్నారు. మొబైల్ ఫోన్ల రికవరీకి కృషిచేసిన జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఎస్పీ ఇన్‌స్పెక్టర్ చెన్నూరి శ్రీనివాస్, ఐటీ సెల్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రాము, ఎస్సై సురేష్, ఐటీ సెల్ సభ్యులు నవీన్, మహేష్, నరేన్ పాల్గొన్నారు.

## నేర్చుకున్న అంశాలను సమర్థవంతంగా అమలుచేయాలి

### ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రం పరిశీలనలో ఆర్జేడీ



మాట్లాడుతున్న ఆర్జేడీ, చిత్రంలో డీఈవో

ఖమ్మం అర్బన్, మే 14: పాఠశాల విద్యలో జరుగుతున్న మార్పులను పూర్తిగా ఆకళింపు చేసుకొని, నేర్చుకున్న అంశాలను పాఠశాల స్థాయిలో విద్యార్థులకు ప్రయోజనం కలిగే విధంగా సమర్థవంతంగా అమలు చేయాలని వరంగల్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సత్యనారాయణరెడ్డి సూచించారు. జిల్లాలోని ఉపాధ్యాయులకు ఖమ్మంలోని హార్వెస్ట్ పాఠశాలలో జరుగుతున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. గణితం, ఇంగ్లిష్, ప్రాథమిక మండల రిసోర్స్ పర్సన్లు శిక్షణ నిర్వహిస్తున్న తీరును.. ఆయన కూడా అదే శిక్షణ గదిలో కూర్చొని పరిశీలించారు. ఉపాధ్యాయుల హాజరును, శిక్షణ కేంద్రంలో కల్పించిన సౌకర్యాలను, వసతులను పరిశీలించారు. డీఈవో సామినేని సత్యనారాయణ, ఏఎంవో రవికుమార్, ప్లానింగ్ కోఆర్డినేటర్ రామకృష్ణ, కోర్సు కోఆర్డినేటర్ శైలజాలక్ష్మి, ఆర్పీలు పాల్గొన్నారు.

## అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలి

- వాటిల్లో కాంగ్రెస్ నాయకుల జోక్యాన్ని నివారించాలి
- పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తాం
- సీపీఐ ఆధ్వర్యంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ముట్టడి



ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ శ్రేణులు

ఖమ్మం, మే 14 : అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో ఖమ్మం కార్పొరేషన్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఖమ్మం నగరంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు. కార్పొరేషన్ కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా సీపీఐ కార్యకర్తలు, పోలీసులకు నడుమ తోపులాట జరిగింది. గేట్లు ఎక్కి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించిన కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో సీపీఐ కార్యకర్తలు కార్యాలయం ఎదుట బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ నాయకుల జోక్యం పెరిగిందని, అధికార పార్టీ నాయకులకే ఇందిరమ్మ ఇండ్లను కేటాయించడం ఎంతవరకు సమాంజసమని ప్రశ్నించారు. పట్టణంలో అనేక ఏళ్లుగా రెక్కల కష్టంపై ఆధారపడి జీవిస్తున్న పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు కేటాయించాలన్నారు. పింఛన్లు, కొత్త రేషన్‌కార్డులు లేని ప్రజలకు వెంటనే అందించాలని, లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే తగిన మూల్యం చెల్లించకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి ఎస్కే జానీమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు యర్రా బాబు, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, తోట రామాంజనేయులు, మేకల శ్రీనివాసరావు, నగర సహాయ కార్యదర్శులు పగడాల మల్లేష్, యానాలి సాంబశివరెడ్డి, జిల్లా సమితి సభ్యులు బండి సత్యం, లక్ష్మీనారాయణ, నూనె శశిధర్, ఏనుగు గాంధీ, నర్సింహారావు, కృష్ణమూర్తి, యాకూబ్, రామకృష్ణ, శ్రావణ్, బోడా వీరన్న, చానా, జాకీర్ పాల్గొన్నారు.

## తరుగు పేరుతో దోపిడీపై నిరసన

- క్వింటాకు 5 నుంచి 7 కేజీల వరకు తీస్తున్నారని రైతుల ఆరోపణ
- తరుగు డబ్బులు మిల్లర్లకు ముందస్తుగా చెల్లిస్తేనే ధాన్యం దిగుమతి
- దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చట్టపరంగా చర్య తీసుకోవాలని డిమాండ్



రావికంపాడు ధాన్యం కొనుగోలు కేంద్రంలో నిరసన తెలుపుతున్న రైతులు

చండ్రుగొండ, మే 14 : మిల్లర్లు తరుగు పేరుతో దోపిడీ చేయడంపై చండ్రుగొండ మండలం రావికంపాడు కొనుగోలు కేంద్రంలో రైతులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. పది రోజుల క్రితం కాంటా వేసిన ధాన్యం నుంచి మిల్లర్లు క్వింటాకు 5 నుంచి 7 కేజీల వరకు తరుగు ఇవ్వాలని డిమాండ్ చేయడంతో నేటికీ ధాన్యం దిగుమతి కాకపోవడంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కాంటాలు పూర్తయిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం నుంచి ఎందుకు తరలించడం లేదని ప్రశ్నించారు. దీనిపై అధికారులను అడిగితే.. డబ్బులు ముందస్తుగా మిల్లర్లకు ఫోన్ పే, ఇతర పద్ధతిలో చెల్లిస్తే వెంటనే ఎగుమతి, దిగుమతి చేస్తామని చెబుతున్నారని వాపోయారు. మిల్లర్ల దోపిడీపై అధికారులకు తెలిపినా సొసైటీ సిబ్బంది, అధికార పార్టీ నేతల ఒత్తిడి వల్ల మాకు న్యాయం జరగడం లేదన్నారు. నిబంధనల ప్రకారం ధాన్యాన్ని ఆరబెట్టి, మిషన్లతో తూర్పార బట్టినప్పటికీ కొర్రీలు పెట్టడం సరికాదన్నారు. తరుగు పేరుతో తమను దోపిడీ చేస్తున్న మిల్లర్లపై చట్టపరంగా చర్య తీసుకోవాలని, కాంటాలు వేసిన ధాన్యాన్ని బేషరతుగా మిల్లర్లు దిగుమతి చేసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు కూసాల శ్రీను, గిన్నె నాగిరెడ్డి, పెండ్యాల కృష్ణారావు, ఇనుముల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### అధికారుల పాత్ర ఉన్నట్లు అనుమానం..



తరుగు కోసం కొత్తగా మిల్లర్లు క్వింటాకు ఏడు కేజీల వరకు నగదు అకౌంటు, ఫోన్ పే ద్వారా రైతులు చెల్లిస్తేనే ధాన్యం దిగుమతి చేసుకుంటామని చెబుతున్నారు. సొసైటీ సిబ్బంది ద్వారానే రైతులను డబ్బులు అడుగుతున్నారంటే వారి దందా ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇందులో అధికారుల పాత్రపై కూడా అనుమానం కలుగుతోంది.

**–ఇనుముల వెంకటేశ్వర్లు, రైతు, రావికంపాడు, చండ్రుగొండ మండలం**

### అన్యాయం జరిగినా పట్టించుకోరా?



అధికారులకు అన్నీ తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారు. మిల్లర్ల దోపిడీపై అధికార పార్టీ నాయకులు ఎందుకు మౌనంగా ఉంటున్నారో వారికే తెలియాలి. ఆరుగాలం కష్టపడి పంట పండించే రైతులకు అన్యాయం జరిగినా పట్టించుకోవడం లేదు. పంట వేసినప్పటి నుంచి ధాన్యం అమ్ముకునేంత వరకు రైతులకు అన్నీ కష్టాలే.

**–గిన్నె నాగిరెడ్డి, రైతు, రావికంపాడు, చండ్రుగొండ మండలం**

### మా సమస్యను ఎవరికి చెప్పుకోవాలి?



ఒక వైపు వర్షాలు.. మరోవైపు తరుగు పేరుతో మిల్లర్లు దోపిడీ. క్వింటాకు ఐదు నుంచి ఏడు కేజీల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఏకంగా సొసైటీ సిబ్బంది ద్వారానే అడిగిస్తున్నారు. మా సమస్యను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులు కనీసం కొనుగోలు కేంద్రాల వైపు కన్నెత్తి చూడడం లేదు. తరుగు దోపిడీపై విచారణ చేపట్టాలి.

**–పూసాల శ్రీను, రైతు, రావికంపాడు, చండ్రుగొండ మండలం**

## కర్రెగుట్టల్లో 21 రోజులు..

- 31 మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం
- భారీగా మారణాయుధాలు, మందుగుండు సామగ్రి సీజ్
- 'ఆపరేషన్ కగార్'తో ఆధీనంలోకి 'అన్న'ల రాజ్యం
- ఈ సెర్చింగ్ ఆపరేషన్‌లో 18 మంది జవాన్లకు గాయాలు
- 216 మావోయిస్టుల స్థావరాలు, బంకర్ల ధ్వంసం
- వివరాలు వెల్లడించిన ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు

*వేల సంఖ్యలో సాయుధ బలగాలు.. ఎత్తయిన కొండల్లో జల్-జంగల్-జమీన్ నినాదాలు.. ఈ రెండింటి మధ్య 21 రోజుల భీకరపోరు.. 'ఆపరేషన్ కగార్' పేరుతో కర్రెగుట్టల్లో మారుమోగిన యుద్ధభేరి.. పచ్చని ప్రకృతి 'వనం'లో పారిన నెత్తుటేర్లు.. మావోయిస్టుల ఏరివేతలో చోటుచేసుకున్న పరిణామాలు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులు నిర్విరామంగా కొనసాగిన 'ఆపరేషన్ కగార్' తీవ్రరూపం దాల్చి ఆ ప్రాంతాలను దాదాపుగా ఆధీనంలోకి తీసుకుంది. ఈ వివరాలను ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు బుధవారం సాయంత్రం పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. – కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 14*



భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్న మావోయిస్టుల ఆయుధాలను పరిశీలిస్తున్న ఛత్తీస్‌గఢ్ డీజీపీ అరుణ్‌దేవ్



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

తెలంగాణలోని ములుగు జిల్లా, ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవుల్లో ఎత్తయిన కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు తల దాచుకున్నారన్న విశ్వసనీయ సమాచారంతో ఏప్రిల్ 21 నుంచి ఈ నెల 11 వరకు ఆ ప్రాంతంలో 'ఆపరేషన్ కగార్' విశ్వరూపం దాల్చిన విషయం విదితమే. 21 రోజులుగా నిర్విరామంగా కొనసాగిన ఈ ఆపరేషన్‌లో భద్రతా బలగాలు పైచేయి సాధించినట్లు పోలీసు అధికారులు వెల్లడించారు. ఆ రాష్ట్ర డీజీపీ అరుణ్‌దేవ్ గౌతమ్ నిర్దేశం మేరకు బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ పాటిలింగం నేతృత్వంలో సీఆర్పీఎఫ్ అధికారుల సారథ్యంలో ఈ ఆపరేషన్ కొనసాగిందని ఆ ఉన్నతాధికారులు వివరించారు. 21 రోజుల్లో కర్రెగుట్టల్లోని వివిధ ప్రాంతాల్లో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇప్పటి వరకు 31 మంది మావోయిస్టులు మృతిచెందినట్లు అధికారులు వెల్లడించారు. ఆ 31 మంది మావోయిస్టుల మృతదేహాలతోపాటు 35 క్యాడర్లకు చెందిన ఆయుధాలను స్వాధీనపరుచుకున్నట్లు చెప్పారు. మృతుల్లో 16 మంది మహిళా మావోయిస్టులు ఉన్నట్లు తెలిపారు. అంతేకాకుండా వీరిలో పీఎల్‌జీఏ 1వ నంబర్ బెటాలియన్, తెలంగాణ రాష్ట్ర కమిటీ, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ సభ్యులు ఉన్నట్లు తెలుస్తోందని పేర్కొన్నారు. మృతుల వివరాలను సేకరిస్తున్నామని, మృతిచెందిన 31 మంది మావోయిస్టుల వివరాలను త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో సీనియర్ క్యాడర్ మావోయిస్టులు సైతం మృతిచెందడమో లేక గాయపడడమో జరిగిందని భావిస్తున్నామన్నారు. దట్టమైన అటవీ ప్రాంతం కావడంతో ఈ ఆపరేషన్‌లో మరికొంత మంది మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనపరుచుకోలేకపోయినట్లు తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ఏప్రిల్ 24న జరిగిన ఎదురుకాల్పుల్లో 3 మృతదేహాలను, మే 5న ఒక మృతదేహాన్ని, మే 7న 22 మృతదేహాలను, మే 8న ఐదు మృతదేహాలను స్వాధీనపరుచుకున్నట్లు వివరించారు. అదనంగా మావోయిస్టులు సంబంధించిన 216 స్థావరాల తోపాటు బంకర్లను ధ్వంసం చేశామన్నారు. ఈ సెర్చింగ్ ఆపరేషన్‌లో 450 ఇంప్రోవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్(ఐఈడీ), 818 బీజీఎల్ షెల్స్, 899 కార్డెక్స్ బండిల్స్, డిటోనేటర్లు, భారీ మొత్తంలో పేలుడు పదార్థాలను స్వాధీనపరుచుకున్నట్లు ధ్రువీకరించారు. మావోయిస్టులకు సంబంధించిన నాలుగు ఆయుధ తయారీ కర్మాగారాలను భద్రతా దళాలు ధ్వంసం చేశాయన్నారు. పెద్ద మొత్తంలో నిత్యావసర సరుకులు, మందులు, రేషన్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ 21 రోజుల ఆపరేషన్‌లో నిమగ్నమైన 18 మంది కోబ్రా, స్పెషల్ టాస్క్‌ఫోర్స్, జిల్లా రిజర్వు గార్డు విభాగాలకు చెందిన జవాన్లు మందుపాతర పేలిన ఘటనల్లో గాయపడ్డారని, వారికి మెరుగైన చికిత్స అందుతోందని తెలిపారు. 45 డిగ్రీల ఎండలో జరిగిన ఈ ఆపరేషన్‌లో ఎంతోమంది జవాన్లు డీహైడ్రేషన్‌కు గురైనప్పటికీ, పట్టువదలకుండా ఆపరేషన్‌ను పూర్తి చేశారని పేర్కొన్నారు. 2024 సంవత్సరంతో పోల్చుకుంటే ఈ ఏడాది 'ఆపరేషన్ కగార్' మరింత వేగం పుంజుకుందని అన్నారు. గడిచిన 4 నెలల్లో ఇప్పటి వరకు 174 మంది హార్డ్ కోర్ మావోయిస్టు మృతదేహాలను స్వాధీనపరుచుకున్నట్లు చెప్పారు. ఈ కర్రెగుట్టల్లో జరిగిన ఆపరేషన్ చాలాకాలం వరకు గుర్తుండిపోతుందన్నారు. మావోయిస్టుల దళాలు క్షీణించడంతోపాటు ఆ ప్రాంతాల్లో భద్రతా దళాలు పూర్తిస్థాయిలో పట్టు సాధించాయని తెలిపారు. బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ రీజియన్, నారాయణ్‌పూర్ జిల్లాలోని మాడ్ రీజియన్‌లో వరుసగా సత్ఫలితాలను సాధించినట్లు చెప్పారు. ఈ ఆపరేషన్‌తో పట్టు సాధింపు చర్యలు కొనసాగుతూనే ఉంటాయని అన్నారు. నిర్దేశిత సమయంలోనే మావోయిస్టు పార్టీని పూర్తిస్థాయిలో నిర్మూలించనున్నట్లు తెలిపారు.